క్లుప్తంగా

ముస్తాబవుతున్న రత్నగిరి సత్రాలు

అన్నవరం: శ్రావణమాసం **ప్రారంభమై వివాహాల సీజన్ కూడా మొదలవడంతో పెళ్లిబృందాలతో రత్నగిరిపై ప్రత్యేక సందడి నెలకొంది. దీంతో ఆలయానికి విచ్చేసే భక్తులు, పెళ్లిబృందాల** అద్దెకిచ్చేందుకు రత్నగిరిపై **ప్రధాన సత్రాలైన** ప్రకాష్‌సదన్, న్యూ సీసీ, ఓల్డ్ సీసీ సత్రాల గదులను ముస్తాబు చేస్తున్నారు. సత్రాలలో గదులకు మరమ్మతులు చురుకుగా జరుగుతున్నాయి. గత నెలలో రూ.1.20 కోట్లతో న్యూ సెంటినరీ, ఓల్డ్ సెంటినరీ, ప్రకాష్‌సదన్ సత్రాలలో మరమ్మతులకు టెండర్లు పిలిచి ఖరారు చేశారు. నెల రోజులుగా సత్రాలకు మరమ్మతులు చేసి గదులలో పాడయిన ఫర్నిచర్, శానిటరీ, విద్యుత్ ఉపకరణాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. పెయింట్లు వేస్తున్నారు. సత్రాలలో జరుగుతున్న మరమ్మతు పనులను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ సోమవారం పరిశీలించారు. సగానికి పైగా సత్రాల గదులలో మరమ్మతులు పూర్తయ్యాయని ఈఈ రామకృష్ణ ఆయనకు వివరించారు. న్యూసీసీ సత్రంలో 48 గదులకు గాను 20 గదులలో మరమ్మతులు పూర్తి చేసి భక్తులకు అద్దెకిచ్చేందుకు వీలుగా సీఆర్వో అధికారులకు అప్పగించామని వివరించారు. ఓల్డ్ సీసీ సత్రంలో 48 గదులకు 23 గదులలో, ప్రకాష్‌సదన్‌లో 86 గదులలో సగం గదులకు మరమ్మతులు పూర్తి చేశామని వివరించారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో అమ్మాయి ఫొటోతో వివాదం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామానికి చెందిన జూంజూరి విశ్వ తేజకు తన ఇన్‌స్టాగ్రామ్‌లో గుర్తు తెలియని అమ్మాయి ఫొటో పెట్టుకోవడం వల్ల వివాదం ఏర్పడిందని ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలుకు చెందిన విశ్వ తేజ రాజమహేంద్రవరంలో ఎలక్ట్రికల్ కార్ల షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో గుర్తు తెలియని అమ్మాయి ఫొటో పెట్టుకున్నాడు. ఈ నెల 18న బిక్కవోలుకు చెందిన కొండాసాయి ఫోన్ చేశాడు. నా ప్రియురాలి ఫొటో ఎందుకు పెట్టుకున్నావు అని బూతులు తిట్టాడు. ఆదివారం తేజ బిక్కవోలు వచ్చాడు. సాయి ఫోన్ చేసి మధ్యాహ్నం హైస్కూల్ వద్దకు రా మాట్లాడుకుందామని చెప్పడంతో తేజ తన స్నేహితుడిని తీసుకువెళ్లాడు. సాయి, మరో ముగ్గురు అతనిని, మిత్రుడిని కొట్టారు. చుట్టుపక్కల వారు అడ్డుకున్నారు. తేజను అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. తేజ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 - 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 - 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 - 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 - 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

తాడిని తలదన్నే రుచి!

- తాటి పండ్లతో అనేక ప్రయోజనాలు
- వాటితో చేసే వంటకాలు అద్భుతం
- నోరూరించేలా గారెలు, బూరెలు



విక్రయానికి సిద్ధంగా తాటి పండ్లు



నూనెలో వేగుతున్న తాటి బూరెలు





తాటి పండ్లతో తయారైన బూరెలు, తాటి అప్పాలు

సామర్లకోట: ప్రస్తుత సీజన్‌లో దొరికేది తాటి పండు. ఈ తాటిపండులో అనేక పోషకాలు ఉంటాయి. ముంజెలు, పండ్లు, తేగలు అందిస్తూ అనేక విధాలుగా మనకు తాటి చెట్లు ఉపయోగపడుతున్నాయి. పూర్వం తాటిచెట్టు, ఆకులతో ఇళ్ల నిర్మాణం జరిగేది. క్రమేపీ పెంకుటిళ్లు, ప్రస్తుతం డాబాలు వచ్చాయి. ప్రకృతి మనకు ప్రసాదించిన పండ్లను తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. తాటి పండుతో అనేక రకాల వంటకాలు చేసుకోవచ్చు. వాటి రుచి ఎంతో అద్భుతంగా ఉంటుంది. తాటిచెట్టుకు కాసిన ముంజెకాయలు ముదిరిపోవడంతో తాటి పండ్లుగా మారుతాయి. ఆ పండ్ల గుంజుతో బూరెలతో పాటు అనేక రకాల పిండి వంటలు తయారు చేస్తారు.

రసాయనాలు లేని ఏకైక పండు

గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు 20 ఏళ్ల క్రితం వరకు ప్రస్తుత సీజన్‌లో తాటిపండ్లతోనే కడుపు నింపుకునే వారు. చెట్టు నుంచి పడిన పండును నేరుగా కొందరు, నిప్పులపై కాల్చుకొని మరి కొందరు ఈ పండ్లను తొక్కలు తీసి నేరుగా తినేవారు. అయితే ప్రస్తుతం ఈ పండ్లను దూరం పెడుతున్నారు. తాటి పండులో అనేక పోషకాలు ఉన్నాయి. ఎటువంటి పురుగు మందులు, రసాయనాలు వాడని తాటి పండ్లు వినియోగం ఆరోగ్యదాయకం. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వంటకాలకు డిమాండ్ పెరిగింది. దాంతో పండ్లను రోడ్డు మార్జిన్‌లో విక్రయించే వారి సంఖ్య పెరుగుతోంది. తాటిపండులో విటమిన్ ఎ,సీలు ఉంటాయి. బి కాంప్లెక్స్ పుష్కలంగా లభిస్తుంది. ఎక్కువగా పీచు పదార్థాలు ఉండటం వలన జీర్ణకోశ వ్యాధులు, మలబద్ధకం దూరం అవుతుంది. రక్త శుద్ధికి, మెదడుకు గ్లూకోజ్ అందించడంలో ఈ పండు దోహదపడుతుంది. నేటి తరం వారికి ఈ తాటిపండు విలువ తెలియడం లేదు. దీనికితోడు తాటి చెట్లను నరికి వేయడంతో ఇవి రాను రాను కనుమరుగైపోతున్నాయి.

అనేక వంటకాలు

తాటి పండ్లతో అనేక రకాల వంటకాలను తయారు చేస్తారు. వీటితో చేసే బూరెలు, గారెలు, రొట్టెలు, అప్పాలు ఎంతో రుచిగా ఉంటాయి. తాటికాయ గుంజు తీసి దానిలో వరి నూక, బెల్లం కలిపి బూరెలు, గారెలు, రొట్టెలు తయారు చేస్తారు. కొన్ని మిఠాయి దుకాణాల్లో ఆంధ్రా పిండి వంటకాల పేరుతో తాటి బూరెల విక్రయాలు సాగుతున్నాయి. వీటి ధర కూడా అధికంగానే ఉంటుంది.

అధిక శ్రమతో కూడిన పని



తాటి పండ్లతో పిండి వంటలు చేయడం ఎంతో శ్రమతో కూడుకున్న పని. శుభకార్యాలలో వేసే బూరెలను సులభంగా తయారు చేయవచ్చు. తాటి పండ్లతో బూరెలు చేయడానికి కనీసం ఇద్దరు ఉండాలి. తాటి పండ్లను నిప్పులపై మగ్గ బెట్టాలి. వాటి తొక్క తీసి గుంజును పీచు లేకుండా తీయాలి. పండ్ల తీపిని బట్టి తగిన మోతాదులో బెల్లం కలపాలి. అప్పటికే నీటిలో నానబెట్టిన నూకను తాటిపండ్ల గుంజులో బాగా కలపాలి. సుమారు 30 నిమిషాలు ఉంచిన తరువాత నూనెలో కావలసిన పరిమాణంలో తాటి బూరెలు, అప్పాలు, గారెలు తయారు చేసుకోవచ్చు. వీటిని ఒకసారి రుచి చూస్తూ వదలిపెట్టే ప్రసక్తి ఉండదు!

– మచ్చా బిందు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

అనేక పోషకాలు



తాటిచెట్ల నుంచి వచ్చే పండ్లలో మంచి పోషకాలు ఉంటాయి. తాటిపండులో విటమిన్లు ఏ,బీ,సీ.. జింక్, పోటాషియం, ఐరన్, క్యాల్షియం వంటి అనేక ఖనిజాలు ఉంటాయి. తాటిపండులో పోషకాలు క్యాన్సర్ నిరోధకంగా పని చేస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచటంలో తాటిపండు దోహదపడుతుంది. తాటిపండు వికారం తొలగించడంలో ప్రభావవంతంగా పని చేస్తుంది. తాటి పండ్లతో పిండి వంటలు తయారు చేసేవారు కనిపిం చడం లేదు. ఆ పిండి వంటలు ఎంతో రుచిగా ఉంటాయి. చిన్నతనంలో స్నేహితులతో కలిసి తినే వారం.

– పసల సత్యానందరావు, డాక్టర్, సామర్లకోట

వైఎస్సార్ సీపీ నేత షర్మిలారెడ్డి ఇంట్లో అగ్ని ప్రమాదం

రూ.10 లక్షల వరకు నష్టం



షర్మిలారెడ్డి ఇంటిలో నుంచి వస్తున్న పొగలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైఎస్సార్ సీపీ నాయకురాలు మేడపాటి షర్మిలారెడ్డి ఇంటిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ సోమవారం ఆ వివరాలను తెలిపారు. షర్మిలారెడ్డి, ఆమె భర్త అనిల్‌రెడ్డితో కలిసి కొద్దిరోజుల క్రితం లండన్‌లో ఉంటున్న వారి కుమార్తె గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. అయితే ఇంటిలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంటిలోని ఫర్నిచర్‌కు మంటలు అంటుకుని ఇల్లంతా పొగ కమ్మేసింది. ఇల్లు లాక్ చేసి ఉండడంతో ఆ పొగలు భవనం పైకి వచ్చాయి. దీన్ని చూసిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందిచారు. వారు వచ్చి తలుపులను పగులకొట్టి మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో ఇంటిలో సుమారు రూ.10లక్షల విలువైన ఫర్నిచర్ ధ్వంసమైంది. అగ్నిప్రమాదం వార్త తెలిసిన వెంటనే వచ్చి సహాయం అందించిన ఫైర్ సిబ్బంది, తన అభిమానులకు షర్మిలారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

జనసేన నేతలపై చార్జిషీట్ వేయాలి

ఎస్పీకి ఫీల్డు అసిస్టెంట్ ఫిర్యాదు



ఆత్మహత్యకు యత్నించి, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫీల్డు అసిస్టెంట్ సునీత (ఫైల్)

కరప: జనసేన పార్టీ నాయకులు తనను కులంపేరుతో దూషించడమే కాకుండా వేధింపులకు గురిచేశారని, వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినా ఇంతవరకు చార్జిషీట్ ఫైల్ చేయలేదని ఫీల్డు అసిస్టెంట్ పులపకూర సునీత సోమవారం ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు. తన చావుతో న్యాయం జరుగుతుందని పోలీసులు భావిస్తే దానికైనా సిద్ధంగా ఉన్నానని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలు సునీత జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు చేసిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి... కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన పులపకూర వీరబాబు భార్య సునీత ఉపాధిహామీ పథకం ఫీల్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు బండారు మురళి ఫీల్డు అసిస్టెంట్ సునీతను కులంపేరుతో దూషించడమే కాకుండా, కోరిక తీర్చాలని లేదా డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. ఆ వేధింపులు తాళలేక గతేడాది అక్టోబర్ నెల 22వ తేదీన నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేధింపులకు గురిచేసిన జనసేన నాయకులు బండారు మురళి, ఘంటా నానిబాబు, గుబ్బల భవానీలపై అదే నెల 28వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు నమోదు చేసి ఐదునెలలు అవుతున్నా చార్జిషీట్ ఫైల్ చేయకపోవడంపై ఈ ఏడాది మార్చి 10న, ఏప్రిల్ 7న కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ నెల 21న కరప పోలీసులు తన వద్దకు వచ్చి బండారు మురళి, మరో ఇద్దరిపై పెట్టిన కేసు కొట్టివేశారు.. కాగితాలపై సంతకం చేయమని అడిగారని, సంతకం చేయనని చెప్పడంతో పోలీసులు వెళ్లిపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను వేధింపులకు గురి చేసినవారిపై చార్జిషీట్ వేసి, వారిని అరెస్ట్ చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్టు సునీత తెలిపారు. తన చావుతో న్యాయం జరుగుతుందని పోలీసులు భావిస్తే అందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆమె తెలిపారు.

జాబ్‌చార్టుపై అవగాహన అవసరం

ఎంపీడీఓల శిక్షణలో రాష్ట్ర అదనపు కార్యదర్శి వెంకటకృష్ణ



ఎంపీడీఓల శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కార్యదర్శి వెంకటకృష్ణ

సామర్లకోట: ఎంపీడీఓలు తమ జాబ్‌చార్టుపై అవగాహన పెంచుకోవాలని, ఇదే తరుణంలో గ్రామ పంచాయతీల సొంత వనరుల ఆదాయాన్ని పెంచడంపై దృష్టి పెట్టాలని రాష్ట్ర అదనపు కార్యదర్శి కె.వెంకటకృష్ణ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పదోన్నతి పొందిన 46 మందికి మొదటి బ్యాచ్‌లో శిక్షణను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సొంత వనరులు సమీకరణ, ఆర్థిక సుస్థిరత ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సహాయం ఆయా గ్రామ పంచాయతీలకు సరిపోదన్నారు. గ్రామ పంచాయతీలు సమగ్రాభివృద్ధికి, సంక్షేమానికి వివిధ కార్యక్రమాలను చేపట్టవలసి ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో సామాజిక న్యాయంతో కూడిన ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు, బహుముఖ అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలులో మండల పరిషత్తు పాలక మండలి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఎంపీపీల నిర్ణయాలనే పాటించవలసిన పనిలేదన్నారు.

విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు మాట్లాడుతూ ఎంపీడీఓ విధి నిర్వహణలో మండల ప్రజా పరిషత్తుకు, ప్రభుత్వానికి బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. డ్వామా ఏపీడీ భానుప్రకాష్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, ఎంపీడీవో డి.శ్రీలలిత, ఫ్యాకల్టీలు శర్మ, డి.శ్రీనివాసరావు, కె సుశీల మొదటి రోజు శిక్షణ నిర్వహించారు.

వంతెన రక్షణపై ఆందోళన



చంద్రవరంలో పేముల కాలువపై ప్రమాదకరంగా ఉన్న రేలింగ్



మల్లవరంలో వంతెన రేలింగ్

చాగల్లు: మండలంలోని పలు వంతెనల రక్షణపై ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. చంద్రవరం, మల్లవరం గ్రామాల్లో పేముల కాలువపై ఉన్న వంతెన రేలింగ్ ప్రమాదభరితంగా దర్శనమిస్తోంది. రాకపోకలు సాగించేందుకు కాలువపై నిర్మించిన వంతెనలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో రేలింగ్ ధ్వంసమయ్యాయి. వంతెనల సంరక్షణను అధికారులు పట్టించుకోవడంలేదని, కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో నిత్యం అనేక మంది ప్రయాణిస్తుంటారు. వంతెనలు ఈ విధంగా ఉండడంతో కాల్వలో పడి ప్రమాదాల బారిన పడతరేమోనని ఆయా గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భర్తపై భార్య కత్తి పీటతో దాడి

అమలాపురం టౌన్: తల్లికి వందనం డబ్బు ఏమి చేశావని అడిగినందుకు భర్తపై భార్య కత్తి పీటతో దాడి చేసి గాయపరిచింది. పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం...అమలాపురం పట్టణం సావరం రోడ్డులో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సావరం రోడ్డులో నివాసం ఉంటున్న పెనుమాల దుర్గాప్రసాద్, దుర్గ దంపతులకు ఇద్దరు పిల్లలు. వారికి ఇటీవల తల్లికి వందనం పతకం కింద వచ్చిన డబ్బు ఏమి చేశావని భర్త దుర్గాప్రసాద్ భార్య దుర్గను అడిగాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన భార్య దుర్గ భర్తపై కత్తి పీటతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో భర్త చికిత్స పొందుతున్నాడు. అతని నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్‌బాబు చెప్పారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

ధవళేశ్వరం: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మత్స్యకారుడు మృతి చెందాడు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక జలారుపేటకు చెందిన సావదాల సత్యారావు (43) సోమవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో గోదావరిలో చేపలు పట్టేందుకు కాటన్ బ్యారేజీ వద్దకు వెళ్లాడు. బ్యారేజ్ స్కవర్ స్లూయిజ్ వద్ద ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ధవళేశ్వరం సీఐ టి.గణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారులో శిశువు జననం

ప్రత్తిపాడు రూరల్: కారులో పండంటి పాపకు ఓ మహిళ సోమవారం జన్మనిచ్చింది. మండలంలోని రాచపల్లికి చెందిన మడికి సారికకు సోమవారం పురిటి నొప్పులు రావడంతో స్థానిక ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గీత సెలవులో ఉండడంతో సిబ్బంది వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తీసుకువెళ్లాని సిబ్బంది సూచించారు. దీంతో గర్భిణి భర్త మడికి చిన్నిబాబు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనుకు విషయం తెలిపారు. దీంతో వైస్ ఎంపీపీ శ్రీను తన కారు రాచపల్లి పీహెచ్‌సీకి పంపి గర్భిణిని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. రాచపల్లి దాటిన వెంటనే పోలవరం కాలువ వద్ద పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో కారులో ఉన్న ఆశా వర్కర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి పురుడు పోసింది. తిరిగి రాచపల్లి పీహెచ్‌సీకి తల్లీబిడ్డను తరలించి వైద్య సేవలు అందించారు.

కళాశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్య

గోపాలపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల శాతం గణనీయంగా పెరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జాన్ పీటర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 29 మంది ఉండగా, ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 69 మందికి చేరిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కళాశాలలో ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్ మొదలగు పోటీ పరీక్షలకు శిక్షణతో పాటు ఉచితంగా మెటీరియల్ అందచేస్తున్నామన్నారు. కళాశాలలో ఉచితంగా మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, అధ్యాపకులు పూర్తిస్థాయిలో బోధన చేస్తున్నారని ప్రిన్సిపాల్ వివరించారు.

కూటమి కుట్రలపై ఉద్యమించాలి

గోపాలపురం: రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెట్టుకోవడానికి విద్యుత్ సంస్థను అమ్మకానికి పెట్టిన కూటమి సర్కార్ కుట్రలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజానీకం ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలీసంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శులు పోరండ్ల శ్రీనివాస్, కురసం లత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారాచంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేష్‌లు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండి అని ప్రచారం చేసుకొని అనేక అమలు కాని హామీలు ప్రజలకు ఇచ్చి మోసం చేసి నేడు అధికారంలోకి వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు పెట్టి పేద మధ్య తరగతి ప్రజల నెత్తిన మోయలేని భారం మోపుతున్నారని ప్రజలు వ్యతిరేకించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట జరిగే మహా ధర్నాలో విద్యుత్ వినియోగదారులు పాల్గొని చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లకు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

రైతులు సేంద్రియ సాగు చేపట్టాలి

నల్లజర్ల: భావితరాలు ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ సాగును ప్రోత్సహించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విక్రయిస్తున్న సేంద్రియ కూరగాయల స్టాల్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రతి రైతు తమకున్న పొలంలో కొంతైనా సేంద్రియ విధానంలో పంటలు పండించాలన్నారు. పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, కషాయాల ద్వారా వ్యవసాయం చేయాలన్నారు. ఇలా పండించిన కూరగాయలు, ఆకుకూరలు అంగన్‌వాడీ సెంటర్లు, మధ్యాహ్న భోజనంలో పాఠశాలలకు సరఫరా చేయాలన్నారు. మార్కెట్‌కమిటీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


చెట్లు ప్రగతికి మెట్లు



సేవ్ ట్రీ ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

నిడదవోలు: ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మొక్కలు పెంచండి, పర్యావరణాన్ని పరిరక్షించండి, చెట్లు ప్రగతికి మెట్లు, సేవ్ ట్రీస్ నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో పి.గురుమూర్తి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వరి, రొటేరియన్స్ దారపు రెడ్డి ప్రతాప్, సానేపు సుబ్బారావు, ఉజ్జిన బలరామ్, గ్రంధి బాలజీ తదితరులు పాల్గొన్నారు.

దారవరం రైల్వేగేటు మూసివేత



మూసివేసిన రైల్వే గేటు

చాగల్లు: ట్రాక్ మరమ్మతుల కారణంగా దారవరం రైల్వేగేటును వచ్చే నెల 2 వతేది వరకు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు సోమవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. దారవరం, చంద్రవరం, మల్లవరం, మార్కొండపాడు మార్గంలో ప్రయాణించే వాహనాదారులు ప్రత్యామ్నాయం మార్గాల్లో తమ గమ్యస్థానాలను చేరుకోవాలని సూచించారు. ఈ మేరకు రైల్వే అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరచు మరమ్మతుల పేరుతో గేటును మూసివేస్తున్నారని, ఈ ఏడాది మే నెలలో 5 రోజులు పాటు మూసివేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డామని స్థానికులు వాపోతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

తాళ్లపూడి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన అన్నదేవరపేట గ్రామానికి చెందిన కొయ్య ముత్యాలు కుటుంబానికి మండల మానవత సంస్థ సోమవారం ఆర్థిక సాయాన్ని అందజేసింది. సంస్థ తరఫున రూ.6 వేలు, సభ్యులు వాసిబోయిన చంద్రయ్య, గెడ్డం సాయిబాబా రూ.500 చొప్పున వెరసి మొత్తం రూ.7 వేల ఆర్థిక సాయాన్ని అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ చేతులు మీదుగా అందజేశారు. సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌కు రెండు రోజులు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని దుమంతునిగూడెం, సుబ్బరాయపురం, కొత్తగూడెం గ్రామాలకు మంగళ, బుధవారాలు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎన్.నారాయణ అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రామన్నపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రామన్నపాలెం రూరల్ ఫీడర్‌లో ఆర్డీడీఎస్ పనుల నిమిత్తం రెండు రోజులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరం కలుగుతుందని ఆయన వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

తాళ్లపూడి: మండలంలోని పైడిమెట్ట ఎత్తిపోతల పథకం వద్ద విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఆదివారం రాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. ఈ మేరకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ముళ్లపూడి రామచంద్రం, విద్యుత్ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. రైతులకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడం కొత్త ట్రాన్స్ పార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మోటార్లు కూడా పాడయ్యాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. తహసీల్దార్ లక్ష్మిలావణ్య, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, నామన పరమేశ్వరరావు, గంటా కృష్ణ, గన్నిన సత్తిబాబు, కాకర్ల వంశీ, తదితరులున్నారు.

సమస్యల వలయంలో పట్టణం

- అధికారుల తీరుపై పాలకవర్గం ఆగ్రహం
- వీధిదీపాలు వెలగక పెరుగుతున్న దొంగతనాలు
- అభివృద్ధి పనుల అజెండాకు ఆమోదం
- వాడీ–వేడిగా మున్సిపల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్, చిత్రంలో ఎమ్మెల్యే ముప్పిడి



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

తాళ్లపూడి(కొవ్వూరు): పట్టణంలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తుందని పాలకవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన సోమవారం జరిగింది. పట్టణంలో వీధి లైట్లు వెలగడం లేదని, డ్రెయిన్లు సక్రమంగా లేవని, పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, జగనన్న లేఅవుట్‌లో రోడ్లు వేయాలని, తాగునీటి సమస్య లేకుండా చూడాలని , పలు చోట్ల పైప్ లైన్‌పనులు చేపట్టాలని, గోదావరి బండ్‌పై రూడా నిధులతో చేపట్టిన పనులు నిరుపయోగంగా మారాయని ఇలా పలు సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఏకరవు పెట్టారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కౌన్సిలర్లు పలు సమస్యలను సమావేశంలో చైర్ పర్సన్, కమిషనర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

మున్సిపాల్టీ ఇంకెందుకు..?

12వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కంఠమణీ రమేష్ బాబు మాట్లాడుతూ కొవ్వూరు పట్టణంలో తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు నిర్వహణ సేవలు పూర్తిస్థాయిలో అందించకపోతే మున్సిపాల్టీ ఇంకేం చేస్తుందని ప్రశ్నించారు. వీధి లైట్లు సక్రమంగా వెలగడం లేదని 1,2,3 జగనన్న లేవుట్లలో రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. తాత్కాలికంగా రోడ్లు వేయాలని కోరారు. గోదావరి బండ్ అభివృద్ధి చేయాలని కోరారు. వార్డుల్లో పనులు చేసేటప్పుడు సభ్యులకు సమాచారం అందించాలన్నారు.

పాముల బెడద

టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ పట్టణంలో ఖాళీ స్థలాల్లో పాముల బెడద ఎక్కువ అయ్యిందని దింతో సమీపంలోని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందిరమ్మకాలనీలో లైట్లు వెలగడం లేదని, పార్క్‌లను అభివృద్ధి చేయాలని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు.

రుడా నిధుల వృథా

9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ పట్టణంలోని గోదావరి బండ్‌ను రుడా నిధులు రూ.కోటి యాబై లక్షలతో వాకింగ్ ట్రాక్, విద్యుత్ లైట్లు తదితర పనులు చేపట్టారని నేటి వరకు అసలు ఉపయోగంలోకి రాలేదని, లైట్లు వెలగడం లేదని, ప్రజాధనం వృథా అయ్యిందని సభ దృష్టికి తీసుకుని వచ్చారు. 14వ వార్డు కౌన్సిలర్ చీర అరుణ వార్డులో రోడ్లు, మంచినీటి సమస్య లేకుండా పరిష్కరించాలని కోరారు.

చర్యలు తీసుకుంటాం

సమస్యలపై కమిషనర్ ఎ.సందీప్ సమాధానం ఇస్తు పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని, లేవుట్లలో ట్యాప్ కనెక్షన్లు ఇస్తున్నట్లు తెలిపారు. వివిధ వార్డుల్లో తాత్కాలికంగా రోడ్డు నిర్మాణాల పనులను చేపడతామన్నారు. ఇళ్లు నిర్మాణం చేపట్టకుండా ఖాళీ స్థలాలుగా ఉంచిన వారికి నోటీసులు జారీ చేశామన్నారు. రూడా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి చర్యలు తీసుకుంటామని వివరించారు.

పుష్కరాలకు రోడ్ల నిర్మాణం

సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో వీధి లైట్లు, చెత్త సేకరణ పారిశుధ్యం, నీటి సరఫరా వంటి ప్రధాన సమస్యలపై దృష్టి సారించాకపోతే ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడతారన్నారు. పుష్కరాలు నాటికి పట్టణంలో అన్ని రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. గోదావరి గట్టుపై పార్క్‌లో చెట్లు పెరిగి నిరుపయోగంగా ఉందని అబివృద్ధి చేయాలన్నారు. చైర్ పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ పట్టణంలో స్థలాలు కొన్నవారు వాటిని ఖాళీగా వదిలియేడంతో స్థానికుల ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. పారిశుధ్యం, చెత్త సేకరణ పట్ల నిర్లక్ష్యం చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేచించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులపై 27 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టగా 2వ అంశాన్ని చైర్‌పర్సన్ తిరస్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు కోడూరి శివరామకృష్ణ, రుత్తల భాస్కర్ రావు, మన్నే పద్మ, అక్షయపాత్ర శ్రీనివాస్ రవీంద్ర, మద్దిపట్ల సాయి గీత, చాందిని, అంకోలు లిల్లీ పద్మావతి, బత్తి నాగరాజు మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన



ఆరోగ్య సబ్‌సెంటర్ వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం అధికారి

ఉండ్రాజవరం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మండలంలో తాడిపర్రు గ్రామంలో సోమవారం కేంద్ర బృందం అధికారులు మధుమతి, రవికిరణ్‌లు సర్వే నిమిత్తం పర్యటించారు. గ్రామంలో పంచాయతీ, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గృహాలను సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య కార్మికులు చేపడుతున్న ఇంటింటా చెత్త సేకరణ, పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల వినియోగాన్ని పరిశీలించారు. గ్రామంలోని పరిస్థితులపై కేంద్రానికి నివేదిక అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.నరేంద్ర, ఈవోపీఆర్డీ ఆంజనేయశర్మ, శానిటరీ మండల కోఆర్డినేటర్ కత్తుల ప్రకాష్, సచివాలయం సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామాన్లు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

నిడదవోలు: సమిశ్రగూడెం భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు కంటిపూడి నాగేంద్ర, సుకన్య దంపతుల ఆర్థిక సహకారంతో మనోజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం క్యారమ్ బోర్డు , షటిల్ బ్యాట్లు, రింగ్స్, స్కిప్పింగ్ రోప్స్, కలర్ కిట్స్ క్రీడా సామగ్రిని అందజేశారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.జిలాని మాట్లాడుతూ సరైన శిక్షణ ప్రోత్సాహం లభిస్తే భవిత కేంద్రంలోని విద్యార్థులు సైతం సాధారణ విద్యార్థులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఆటవస్తువులు అందిచడం ద్వారా వారి శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో తోర్పాటును అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకురాలు కుంచాల విజయశ్రీనివాసరెడ్డి, సభ్యులు గారపాటి విజయదుర్గ, ఉపాధ్యాయులు డి.రవికుమార్, బి.లక్ష్మణరావు, గౌరీదేవి, ఫిజియో థెరపిస్ట్ పి.ఉమాగాయత్రి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు పూర్తి

గోపాలపురం: మండల మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ బుధవారం నిర్వహించే రక్తదాన శిబిరానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల మానవత అధ్యక్షుడు రాపాక ఫణి కిషోర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక డాక్టర్ కె.చైతన్య ఆధ్వర్యంలో, శర్వాణి హైస్కూల్ ఆవరణలో నిర్వహించే ఈ శిబిరంలో పరిసర ప్రాంతాల యువత పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్యే తలారి పరామర్శ



కాపవరంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి(కొవ్వూరు): మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల కుటుంబ సభ్యులను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డీనేటర్ తలారి వెంకట్రావు సోమవారం పరామర్శించారు. కాపవరం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చౌటుపల్లి తాతారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ తరపున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ సుంకర సత్యనారాయణ, ఉప్పలూరి సూరిబాబు పాల్గొన్నారు.

హరిశ్చంద్ర ప్రసాద్ జయంతి

ఉండ్రాజవరం: ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ జయంతిని మండలంలోని తాడిపర్రు గ్రామంలో సోమవారం రైతులు, కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపర్రులో ఉన్న ఆయన విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన రైతుల అభ్యుదయానికి చేసిన కృషిని కోనియాడారు. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

నల్లజర్ల: ఎదురుగా వస్తున్న బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. నల్లజర్ల శివారులో వీధులమ్మ గుడి సమీపంలో సోమవారం మధ్యాహ్నం పెంటపాడు గ్రామానికి చెందిన సింగలూరి శ్రీనివాస్ బైక్‌పై వస్తుండుగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీనివాస్ కాలు విరగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రుడుని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

తాళ్లపూడి: మండలం పరిధిలోని అన్నదేవరపేట గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై టి.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తనిఖీల్లో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై వివరించారు. వారివద్ద నుంచి రూ.9,720 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.